సాక్షి తిరుపతి

బుధవారం । 19 । మార్చి । 2025



పేదల ఇల్లు కూల్చివేత

గత ప్రభుత్వ హయాంలో పేదలకిచ్చిన ఇళ్లను ముందస్తు సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులు కూల్చివేశారు.

- 8లో



భూ ఆక్రమణలపై ముమ్మర దర్యాప్తు

అటవీ భూముల ఆక్రమణలపై సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన సీరియస్ అయ్యారు. దర్యాప్తు చేపట్టారు. నివేదిక ఇవ్వాలన్నారు.

- 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
తిరుపతి	6-26	4-58
గూడూరు	6-21	4-54

న్యూస్‌రీల్

భూసేకరణ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలసి వర్చువల్ పద్ధతిలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులు పూర్తి చేయించే దిశగా ఆర్డీఓలు పర్యవేక్షించాలని చెప్పారు. సాగరమాల కింద చేపట్టనున్న 2, 3, 4 ప్యాకేజీ జాతీయ రహదారి పనులు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు వెంకటేష్, ఎంకే చౌదరి, రవీంద్రరావు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామమోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇక ఉదయం 9 నుంచే గ్రీవెన్స్

– మండల, డివిజన్, జిల్లా స్థాయిలోనూ అమలు

తిరుపతి అర్బన్: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 9 కే ప్రారంభించి, మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయం 9 కే మొదలు పెట్టి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. వచ్చే సోమవారం నుంచి ఈ పద్ధతిలో ఉంటుందన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోనే కాకుండా డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఉదయం 9 గంటల నుంచే ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

శతపథికి అవార్డు




అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ శతపథి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ మాజీ వీసీ, ప్రస్తుతం ఐఐటీ భువనేశ్వర్‌లో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథికి శ్రీభాష్యం పార్థసారథి రాష్ట్రీయ అవార్డు ప్రదానం చేశారు. మంగళవారం హైదరాబాద్ వేదికగా ఉస్మానియా వర్సిటీ సంస్కృత అకాడమీ, సర్వ వైదిక సంస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి, అకడమిక్ పరిపాలనలో విశేష సేవలు అందించినందుకు పురస్కారాన్ని అందజేశారు.

చౌక.. చక్కనైన వ్యాపారం

పేదల ఆకలి తీర్చాల్సిన ఉచిత బియ్యం పక్కదారి పడుతోంది. రూపు మార్చుకుని బహిరంగ మార్కెట్‌ల్లోకి అడుగుపెడుతోంది. ఇందుకు తొలుత గోడౌన్లలోనే బీజం పడుతోంది. ఆ తరువాత చౌక దుకాణాలూ అడ్డాగా మారుతున్నాయి. కార్డుదారులు సైతం ఉచిత దొడ్డు బియ్యాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా కిలోల్లో కొనుగోళ్లు చేసి.. టన్నుల కొద్దీ పొరుగు రాష్ట్రాలకు తరలించి, అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మరి కొందరు స్థానికంగా మిల్లులో పాలిష్ పట్టి నాణ్యమైన బియ్యం పేరుతో విక్రయించి, వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఇలా చౌక బియ్యంతో చక్కనైన వ్యాపారం సాగిస్తూ.. జేబులు నింపుకుంటోంది రేషన్ మాఫియా. పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు మాత్రం రేషన్ అక్రమాలకు అడ్డుకట్ట వేయడం లేదు.





తూకాల్లో నొక్కుడు

- రాష్ట్రాలు దాటుతున్న రేషన్
- ఇటు తమిళనాడుకు..అటు కర్ణాటకకు
- బస్తాకు కిలో బియ్యం తగ్గింపు
- 3,340 బస్తాలు నెలకు మిగులు

తిరుపతి అర్బన్: చౌకదుకాణాల రేషన్ బియ్యాన్ని కొందరు వ్యాపారులు చెన్నైపోర్టుకు తరలిస్తున్నారు. మరి కొందరు కర్ణాటకకు, ఇంకొందరు స్థానికంగా రైస్‌మిల్లర్లకు తరలిస్తున్నట్లు చర్చసాగుతుంది. రేషన్ దుకాణాల్లో బియ్యం కార్డుదారులకు ఉచితంగా ఇస్తున్నారు. పలువురు డీలర్లు కిలో బియ్యానికి రూ.15 కార్డుదారుడికి చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులకు కిలో రూ.25 నుంచి 27 వరకు విక్రయిస్తున్నారు. ఆ తర్వాత ఆ బియ్యాన్ని చెన్నైలోని రెడ్‌హిల్స్ ప్రాంతానికి చెందిన వ్యాపారులకు కిలో రూ. 33 నుంచి రూ.35కు విక్రయిస్తున్నారు. ఆ తర్వాత శ్రీలంక, ఇండోనేషియా తదితర దేశాలకు రేషన్ బియ్యాన్ని ఎంచెక్కా తరలిస్తున్నారు. కొందరు ఇలా వ్యాపారం చేయడమే వృత్తిగా మార్చుకున్నారు. దీంతో ఉచిత రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. ప్రతి నెల 25 శాతం బియ్యం వ్యాపారం వైపు వెళుతున్నట్లు అధికారులు లెక్కలు కడుతున్నారు.

రేషన్ బియ్యం రాయితీతో ఇలా..

కిలో బియ్యం రూ.30 నుంచి రూ.35 సర్కార్ కొనుగోలు చేస్తోంది. అయితే పేదోళ్ల మూడు పూటల భోజనం చేయడానికి కేంద్ర సర్కార్ 2023 నుంచి 2028 వరకు ఉచితంగా బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు మనిషికి 5 కిలోల చొప్పున రేషన్ కార్డులో ఎంత మంది సభ్యులుంటే అన్ని 5 కిలోల వంతున అందిస్తోంది. అలాగే అంత్యోదయ కార్డులకు 35 కిలోల బియ్యం, అన్నపూర్ణకార్డులకు 10 కేజీల బియ్యం చొప్పున ప్రతి నెలా అందిస్తోంది. అయితే ఆ రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు రాష్ట్రాలను దాటిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌కు బియ్యాన్ని తరలిస్తూ పేదోళ్ల పొట్టకొడుతున్నారు.

దందా ఎలాగంటే..

రేషన్ దందా ఎలా సాగుతుందంటే.. గోడౌన్ల నుంచి 50 కిలోల బస్తాలను డీలర్లకు పంపుతారు. ఒక్క బస్తా నుంచి ఒక కేజీని తగ్గించి ఇచ్చేస్తున్నారని చర్చ సాగుతుంది. జిల్లాలోని 17 గోడౌన్ల నుంచి ప్రతి నెలా సుమారుగా 8,350 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 1,457 మంది డీలర్లు పంపిణీ చేస్తున్నారు. 8,350 మెట్రిక్ టన్నులు అంటే 50 కిలోల బస్తాలు 1.67 లక్షలు పంపిణీ చేయాల్సి ఉంది. బస్తాకు కిలో చొప్పున కొట్టేస్తే నెలకు 3,340 బస్తాలు మిగులు ఉంటుంది. ఈ బియ్యంతోనే వ్యాపారం సాగుతుందని చర్చ సాగుతుంది. మరోవైపు డీలర్లు కార్డుదారులకు ఇచ్చే బియ్యంలోనూ తగ్గింపు ఉంది. ఆ బియ్యంతో వ్యాపారం సాగుతోంది. ఇంకోవైపు 20 శాతం మంది కార్డుదారులు డీలర్ వద్ద బయోమెట్రిక్ వేసిన తర్వాత కిలో రూపాయి వంతున రూ.15 చొప్పున డీలర్‌కు ఇచ్చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆ బియ్యంతోనే వ్యాపారం సాగుతుంది.

పట్టుబడిన బియ్యం వేలం ద్వారా విక్రయాలు

అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన బియ్యాన్ని ఆయా గోడౌన్లలో నిల్వ చేసి, తర్వాత ఏడాదికి ఒక్కసారి ఆ బియ్యాన్ని వేలం వేస్తున్నారు. పట్టుబడి స్టాక్ ఉన్న రెండు లక్షల టన్నుల బియ్యాన్ని గత ఏడాది వేలం పాట ద్వారా విక్రయించారు. అధికారులు అక్రమంగా తరలిపోతున్న బియ్యంపై పటిష్టమైన చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలా ఇష్టారాజ్యంగా వ్యాపారం సాగుతుందని అంతా చర్చించుకుంటున్నారు.

జిల్లా పౌరసరఫరాల సమాచారం

రేషన్‌దుకాణాల సంఖ్య	1,457
కార్డుదారుల సంఖ్య	6.03 లక్షలు
ప్రతినెలా పంపిణీ చేసే బియ్యం	8350 మెట్రిక్ టన్నులు
ఎండీయూ వాహనాలు సంఖ్య	369
అందుబాటులో ఉండే ఎండీయూ వాహనాలు	190

అధికారులు మాత్రం 70 మినహా మిగిలిన వాహనాలు వాడుకలో ఉన్నాయని చెబుతున్నారు.

చిలక్కొట్టుడిలా..

- బస్తాకు కేజీ బియ్యం తగ్గింపు
- నెలకు 8,350 మెట్రిక్ టన్నులు బియ్యం
- నెలకు 1.67 లక్షల 50 కిలోల బస్తాలు
- 3,340 బస్తాలు మిగులు

గోడౌన్‌లో కొంత.. డీలర్లు మరికొంత నొక్కేస్తున్నారు

పారదర్శకంగా బియ్యం తూకాలు జరగడం లేదని రేషన్ డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. గోడౌన్ల నుంచి తమకు వచ్చే సమయంలో బస్తాకు కిలో నుంచి రెండు కిలోల బియ్యం తగ్గిపోతున్నాయని పలువురు డీలర్లు వాపోతున్నారు. అయితే అదే పద్ధతిని వారూ పాటిస్తున్నారు. కార్డుదారులకు ఇచ్చే సమయంలో తూకాల్లో మోసాలు చేస్తున్నారు. ఉదాహరణకు 30 కిలోలు ఇవ్వాల్సిన కార్డుదారునికి 29 కేజీలనే ఇస్తున్నారు. దీనిపై కార్డుదారులు గట్టిగా డీలర్‌ను ప్రశ్నిస్తే, తమకు గోడౌన్ల నుంచి తూకాల్లో తక్కువగా ఇస్తున్నారంటూ వారిపై నెట్టేస్తున్నారు.

గోడౌన్ల నుంచి తగ్గింపు లేదు



గోడౌన్ల నుంచి డీలర్లు బియ్యం తగ్గించడం లేదు. వారికి ఎంత మోతాదులో బియ్యం ఇవ్వాలో అ లెక్క ప్రకారమే పంపుతున్నాం. కొందరు డీలర్లు అనుమానం ఉంటే సమీపంలోని ఏ మెంట్ వద్ద తూకాలు వేసుకుంటున్నారు. ఏమైనా బియ్యం తక్కువ వస్తే వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరోవైపు రైస్ మిల్లర్లకు కచ్చితంగా ఆదేశాలు ఇచ్చాం. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం లేదా పాలిష్ పట్టడం చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించాం.

– వై.సుమతి, జిల్లా సివిల్ సప్లయి మేనేజర్

డీలర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం



రేషన్ డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. తూకాల్లో 100 గ్రాములు తక్కువ ఉన్నా చర్యలు తీసుకుంటామని చెప్పాం. మరోవైపు కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటాం. అలాగే అవసరం లేకుంటే కార్డుదారులు బియ్యం కొనుగోలు చేయకుండా ఉండాలి. అంతే తప్ప తమ బియ్యాన్ని డీలర్‌కు లేదా ఇతరులకు విక్రయించడం సరికాదు. అంతేకాకుండా బియ్యం వ్యాపారం చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఏదైనా సమాచారం వస్తే వెంటనే బియ్యం స్టాక్ చేసిన ప్రాంతాల్లో దాడులు చేస్తున్నాం. ఉచితంగా రేషన్ దుకాణాల నుంచి ఇస్తున్న బియ్యాన్ని దుర్వినియోగం చేయరాదని అవగాహన కల్పిస్తున్నాం.

– శేషాచలం రాజు, జిల్లా సివిల్ సప్లయి అధికారి

జూడాల వినూత్న నిరసన



ముఖానికి మాస్కులు ధరించి వినూత్న నిరసన తెలుపుతున్న జూడాలు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో గౌరవ వేతనం పెంచాలంటూ గత 44 రోజులుగా సమ్మె చేస్తున్న విద్యార్థులు మంగళవారం వినూత్న నిరసనలతో హోరెత్తించారు. వెటర్నరీ రంగం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో కూడిన గణాంకాలను ప్రదర్శిస్తూ ముఖాలకు మాస్కులు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పశువైద్య విభాగం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి వేల కోట్లు ఆదాయం సమకూరుతున్నా, వైద్య విద్యార్థుల న్యాయపరమైన డిమాండును పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులతో పాటు వర్సిటీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా తమ సమస్యను పరిష్కరించ డం లేదని వాపోయారు. సమస్య పరిష్కారమ య్యే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు.

దివ్యాంగులకు జాబ్‌మేళా రేపు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో గురువారం దివ్యాంగులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 300 ఉద్యోగాల కోసం పలు పేరొందిన కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నట్లు తెలియజేశారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమో, బీటెక్ చదివిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95338 89902, 79898 10194ను సంప్రదించాలని కోరారు.

మైక్రో ఇరిగేషన్ పురోగతిపై చర్యలేంటి?

- పార్లమెంటులో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లాలో మైక్రో ఇరిగేషన్ అమలు, ఆ జిల్లాలో సాధించిన పురోగతి, లబ్ధిదారులు వివరాలు, సూక్ష్మ నీటిపారుదల సాంకేతికత ప్రోత్సాహంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నించారు. ఈ విషయంపై మంగళవారం ఢిల్లీ పార్లమెంట్‌లో ఎంపీ ప్రశ్నించారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం 2015–16 నుంచి దేశవ్యాప్తంగా అమలులో ఉందని, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 96.97 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మైక్రో–ఇరిగేషన్ చేపట్టారని తెలిపారు. తిరుపతి జిల్లాలో 20,819 హెక్టార్లు మైక్రో–ఇరిగేషన్ కింద కవర్ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు, వారికి అందిస్తున్న ఆర్థిక సహాయం వివరాలు వెల్లడిస్తూ సన్న, చిన్నకారు రైతులకు 55శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 45 శాతం సబ్సిడీ అందిస్తున్నామని పేర్కొన్నారు.

హింసాత్మకం.. విచారణకు ఆదేశం

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు..పలుకుబడి.. అధికార బలం ఉంటే కొన్ని రోజుల పాటు చేసిన పాపాల నుంచి నెట్టుకు రావచ్చే తప్ప, ఏదో ఒక రోజు శిక్ష అనుభవించి తీరాల్సిందే. నగర డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో చోటు చేసుకున్న మానవ హక్కుల ఉల్లంఘన పరిణామాలపై ఇదే జరుగుతోంది. ఎంపీ గురుమూర్తి ఫిర్యాదుతో డిప్యూటీ మేయర్ ఎన్నికలో హింసపై విచారణకు రంగం సిద్ధమైంది.



కార్పొరేటర్ల బస్సుపైకి దూసుకువస్తున్న కూటమి నేతలు(ఫైల్)



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేస్తున్న కూటమి నాయకులు(ఫైల్)

- ఎంపీ గురుమూర్తి ఫిర్యాదుపై స్పందించిన ఎన్నికల కమిషన్
- హింసపై మూడు రోజులలో సమగ్ర నివేదిక ఇవ్వాలని డీజీపీకి ఆదేశం



బస్సు అద్దాలు ధ్వంసం చేస్తున్న కూటమి నేతలు(ఫైల్)

తిరుపతి తుడా: కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక.. హింసాత్మక ఘటనలపై విచారణ జరపాలని డీజీపీని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన నేతలు సృష్టించిన అరాచకాలు, హింసాత్మక ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి. నాడు చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన సీసీ పుటేజీలు, వీడియో క్లిప్పింగులు, పేపర్ కటింగ్ ఆధారాలతో ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ప్రస్తావించారు. అలానే జాతీయ మానవ హక్కులకు ఫిర్యాదు చేశారు. అలానే బీజేపీ మాజీ ఎంపీ, ప్రముఖ న్యాయవాది సుబ్రహ్మణ్యస్వామి సైతం ఈ అరాచకాలపై రాష్ట్ర హైకోర్టు తలుపు తట్టారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో కార్పొరేటర్లు, వారి బంధువుల ఆస్తులపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ యంత్రాంగం నిబంధనల పేరుతో ఆస్తుల ధ్వంసం ఘటన, కొంత మంది కార్పొరేటర్లపై దాడులు, కిడ్నాప్‌లు, ఎన్నిక జరిగిన ప్రదేశంలో సృష్టించిన అల్లర్లు, హింసపై చర్యలు తీసుకోవాలని ఎంపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరిన నేపథ్యంలో రాష్ట్ర డీజీపీని విచారణకు ఆదేశించారు.

అధికారుల గుండెల్లో రైళ్లు

నగర డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు వారి బంధువుల ఆస్తుల ధ్వంసానికి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్పడ్డారు. నిబంధనలు లేనప్పుడు ఆదిలోనే అడ్డుకోవాల్సిన అధికారులు ఎన్నిక నేపథ్యంలో రెండు రోజులు ముందు ధ్వంసం పేరుతో హైడ్రామా సృష్టించారు. టౌన్ ప్లానింగ్ దౌర్జన్యాలకు కొంతమంది కార్పొరేటర్లు లొంగిపోయి, టీడీపీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసేందుకు దోహదపడేలా సహకరించారు. ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వస్తున్న కార్పొరేటర్లపై టీడీపీ, జనసేన అల్లరిమూకలు దాడులు చేశారు. పోలీసుల సమక్షంలోనే కార్పొరేటర్లు వస్తున్న వాహనంపై దాడికి తెగబడ్డారు. ఆ వాహనం అద్దాలు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురి చేశారు. పోలీసులు, మీడియా సమక్షంలోనే ఐదుగురు కార్పొరేటర్లపై దాడికి తెగబడి కిడ్నాప్ చేసి, అధికార పార్టీ నేతల వాహనాల్లో తరలించారు. హింస జరుగుతున్న పోలీసులు అడ్డుకోకపోగా ప్రేక్షకపాత్ర వహించారు. ఈ వ్యవహారంపైనే వైఎస్సార్ సీపీ న్యాయపోరాటం చేస్తోంది. మహిళలు, ముఖ్యంగా దళిత ప్రజాప్రతినిధుల హక్కులను అణచివేచేలా వ్యవహరిస్తున్న పోలీసు అధికారుల తీరుపై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపీతో పాటు ప్రముఖ న్యాయవాది సుబ్రహ్మణ్యస్వామి న్యాయపోరాటానికి దిగారు. ఈ ఘటనలో పూర్తిగా మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని దళిత ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఎంపీ మనస్తాపానికి గురయ్యారు. దళిత ఎంపీ అయిన తనపై కూడా అసభ్య పదజాలంతో దాడికి పాల్పడ్డారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర హైకోర్టు, పార్లమెంటు సైతం తీవ్రంగా స్పందించి వరుస విచారణలకు ఆదేశిస్తూ ఉన్నాయి. విచారణ మొదలవడంతో నాడు విధుల్లో ఉన్న పోలీసు అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ వ్యవహారంలో దోషులుగా చట్టం ముందు నిలబడక తప్పదని తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

దళిత ప్రజాప్రతినిధుల హక్కుల ఉల్లంఘన

తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఒక కార్పొరేటర్ బలం ఉన్న టీడీపీ ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కింది. ఆ ఎన్నికల్లో గెలిచేందుకు అధికార బలంతో టీడీపీ, జనసేన నేతలు అనేక చట్ట ఉల్లంఘనలు, మానవ హక్కులకు భంగం, దళిత ప్రజా ప్రతినిధుల హక్కులను అణచివేయడం తదితర ఘటనలకు పాల్పడ్డారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై ఎన్నికల కమిషన్ ఎట్టకేలకు స్పందించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్య కార్యదర్శి కేఆర్ బీహెచ్ఎన్ చక్రవర్తి హింసాత్మక ఘటనలపై సమగ్ర విచారణ జరిపి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)ని ఆదేశించింది. ఎన్నికల్లో చోటు చేసుకున్న మానవ హక్కుల ఉల్లంఘన, దళిత ప్రజా ప్రతినిధుల హక్కుల అణిచివేత, కిడ్నాప్ వ్యవహారంపై లోతైన దర్యాప్తు నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

భయానక వాతావరణం సృష్టించిన కూటమి

46 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఉండగా కూటమి నుంచి ఒకే ఒక్కడు కార్పొరేటర్‌గా ఉన్నారు. 11 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను ప్రలోభాలతో లొంగదీసుకున్నారు. అయినా వారి బలం 12కు మించలేదు. ఎలాగైనా అధికార బలంతో డిప్యూటీ మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలని ఓ మంత్రి ఏకంగా తిరుపతిలో తిష్ట వేసి అధికారులను పురమాయించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా కార్పొరేటర్లు వారి ఆస్తులపై దాడులు నిర్వహించాలని హుకుం జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారులకు అప్పటివరకు గుర్తుకురాని నిబంధనలు సరిగ్గా అప్పుడే గుర్తుకొచ్చాయి. డిప్యూటీ మేయర్‌గా వైఎస్సార్ సీపీ బలపరిచిన శేఖర్ రెడ్డి భవనంతోపాటు మరో ఇద్దరు కార్పొరేటర్ల, వారి బంధువుల ఆస్తుల ధ్వంసానికి పూనుకున్నారు. దీంతో చేసేది లేక కార్పొరేటర్లు టీడీపీ బలపరిచిన ఆర్సీ మునికృష్ణకు మద్దతు ఇచ్చారు. అలానే కార్పొరేటర్లు బస చేస్తున్న హోటళ్లపై అర్ధరాత్రి వేళ భయానక వాతావరణం సృష్టించి దాడులకు తెగబడ్డారు. ఫిబ్రవరి 3వ తేదీ ఓటింగ్‌కు వచ్చిన కార్పొరేటర్లపై టీడీపీ, జనసేన మూకలు హింసకు పాల్పడ్డారు. కార్పొరేటర్లు వస్తున్న వాహనంపై దాడికి తెగబడి, ఐదుగురు కార్పొరేటర్లను కిడ్నాప్ చేశారు. సీసీ పుటేజీలు, వీడియో క్లిప్పింగులు, ఫొటోలు, పేపర్ కటింగ్‌లో హింసకు, కిడ్నాప్‌నకు, దాడులకు తెగ బడ్డ టీడీపీ, జనసేన మూకలు స్పష్టంగా కనిపిస్తున్నారు. ఈ కేసులో అరాచకాలకు పాల్పడిన ప్రజా ప్రతినిధులు ద్వితీయ శ్రేణి నాయకులు మాట విని దాడులకు తెగబడి తప్పు చేశామని, అరెస్టయి, జైలుకు పోక తప్పదని భయాందోళనలో ఉన్నారు.

వడదెబ్బపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్యశాఖాధికారి

తిరుపతి తుడా: ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో బ్యానర్లు, పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ రూప్‌కుమార్, జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ మధుబాబు, లావణ్య, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,824 మంది స్వామివారిని దర్శించుకోగా 25,674 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.84 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

నోటీస్ బోర్డు

కనుపూరుకు 250 ప్రత్యేక బస్సులు

వాకాడు: చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న ముత్యాలమ్మ అమ్మవారు జాతర సందర్భంగా ప్రయాణికుల కోసం దాదాపు 250 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు వాకాడు డిపో మేనేజర్ ఎంసీ పెంచలయ్య తెలిపారు. ఆయన వాకాడులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరగనున్న ముత్యాలమ్మ అమ్మ వారు జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వాకాడు డిపోతోపాటు వెంకటగిరి, నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట డిపోల నుంచి జాతర ప్రత్యేక బస్సులు నడపతామన్నారు.

23న రాయలసీమ మాలల సింహగర్జన


నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

శ్రీకాళహస్తి: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 23వ తేదీన జరిగే రాయలసీమ మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం హలో మాల చలో తిరుపతి రాయలసీమ మాలల సింహగర్జన పోస్టర్‌ను పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలల పెద్దలతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు నారాయణ, విశ్రాంత ఉద్యోగి నాగరాజు, పోతల చంద్ర, రోడ్డు గోపి, పసల బాలాజీ, పెరిమిడి రఘు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి

ప్లాట్లు అమ్మకము(Plots)

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థచే (తుడ) అభివృద్ధి పరచబడిన సూరప్పకశం గ్రామం పద్మావతినగర్ లేఔట్ నందు రెసిడెన్షియల్ ప్లాట్లు తేది: 26.03.2025 నుండి 01.04.2025 వరకు "e" వేలము ద్వారా విక్రయించబడును. వివరములకు www.tudaap.in ఫోన్ నెంబరు 0877-2225730 (ఉదయము 8.00గం॥ల నుండి రా.8.00గం॥ల వరకు సెలవు రోజులు సైతం). ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 20.03.2025

సం/- శ్రీమతి ఎన్.మౌర్య, IAS,
ఉపాధ్యక్షులు, తుడ, తిరుపతి



సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■తిరుపతి, చిన్న అంజిమేడు ద్వారకామయి -8, ఈస్ట్‌ఫేస్ 40 అడుగుల రోడ్ ఫైనల్ తుడా Approved ప్లాట్స్ 40x83=92 అం. అమ్మబడును. 94419 95796, 966328932.

RENT

■ Commercial Space for Rent. Tirupati, Tilak Road, East Facing, 4 Floors Total 5800 Sqft East Facing, Corner Road, Lift Facility, Cellar Parking for Two Wheelars. ✆ 799 799 7033.

Services

■రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపారం రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPAవారు కూడా సలహాల కొరకు సంప్రదించండి. పార్థిబా, 9121625779.

■పర్సనల్, వ్యవసాయ భూములకు, రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు, ఇండస్ట్రీలకు ఫైనాన్స్ సలహాల కొరకు సంప్రదించండి సెల్: 9063290884

TRAINING

■ప్రభుత్వ పథకం ద్వారా మహిళలకు ఉచితంగా కంప్యూటర్,Tally, టైలరింగ్ కోర్సుల నందు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించబడును. ఉచిత హాస్టల్ వసతి కలదు.నెల్లూరు. సంప్ర: 78874 18417.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించవలసిన ప్రతిపనులు సంప్రదించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే ఏరకమైన క్లెయిమ్ లకు వారితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Wanted

■ Urgent Openings: Shreeja Mahila Milk Producer Organization. Field Chemists-30 Nos. B.Sc Chemistry, Dairy Science, DAH & Dairy Technology. IT Technicians-4 Nos Knowledge on Hardware &Installations. Filed Technicians-10Nos ITI/Diploma in Electical, Electronics, Mechatronics, Civil. Facilitators-15 Nos Any Degree. PIB Executives-2 Nos Degree in Sociology, Rural Development/Science,Agricultural Science.Freshers & Experienced can apply. 2wheeler & Licence is must. ✆ 9154282113,Email: career@shreejamilk.com & hr@shreejamilk.com

■స్పాట్ జాయినింగ్. తిరుపతి, తిరుమల నందు కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ద్వారా అటెండర్స్, కంప్యూటర్ Op.,రికార్డ్ అసిస్టెంట్స్, సూపర్‌వైజర్స్ జాబ్స్ కలవు. Age: 18 to 35, Sal: 16,000 to 22,000. 96032 55559.

■తిరుమల, శ్రీకాళహస్తి, పీలేరు, కుప్పం, పలమనేరులో రాష్ట్ర సంస్థలో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను. ✆ 9154916915, 9949942245.

■చిత్తూరు నందు 70సం.ల మహిళకు వంట పని & ఇంటిపని చేసి తోడుగా ఉండు 40 సం.ల పైబడిన మహిళ కావలెను. ఉచిత భోజనం, వసతితో తగిన జీతం ఇవ్వబడును.90323 79045.

■ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639663, 8977639662

■మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000. సంప్ర॥ 80084 01243.

■మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

టీడీఆర్.. ఒకరికే వందనం

నాలుగు జిల్లాల అవతల ఉన్నతాధికారి.. ఆఘమేఘాలపై జూమ్ మీటింగ్.. వాట్సాప్‌లో సంతకం చేసిన దస్త్రం.. రాత్రికి రాత్రే ఆమోదం.. జారీ.. ఇందంతా ఒక్కరికే వందనం.. మిగిలిన వారికి శూన్య హస్తం. ఇదీ తిరుపతి నగరాభివృద్ధిలో రోడ్ల విస్తరణకు జారీ చేసిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) బాండు కథ.

- వందల మందికి మొండిచెయ్యి
- సీఎంఓ నుంచి ఒత్తిడి తేవడంతో ఆగమేఘాలపై జారీ
- కమిటీ నేరుగా హాజరుకాకుండానే ఆమోదం
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ


మున్సిపల్ కార్యాలయం

తిరుపతి తుడా: నగరంలో మెరుగైన రవాణా వ్యవస్థను తీసుకురావడం, నగరాన్ని మరింతగా విస్తరించాలన్న సంకల్పం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం తిరుపతి నగరంలో 21 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టింది. కౌన్సిల్ ఆమోదంతో యుద్ధ ప్రాతిపదికన మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేసింది. ఇప్పటికే 17 మాస్టర్ ప్లాన్ రోడ్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి, విస్తరణకు ప్రజలు ఆయా ప్రాంతాల్లో భూములను గిఫ్ట్ డీడ్‌గా మున్సిపల్ కార్పొరేషన్‌కు రాసిచ్చారు. ఈ క్రమంలో భూములిచ్చిన రైతులు, యజమానులకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లను ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో కొంతమందికి టీడీఆర్ బాండ్లు సకాలంలో అందించగా, ప్రస్తుత ప్రభుత్వం వాటిపై ఆంక్షలు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీఆర్ బాండ్ల జారీపై ఇప్పటికే రెండు కమిటీలను వేసింది. అయితే టీడీఆర్ బాండ్ల జారీలో మామూళ్లకు కక్కుర్తి పడి ఆశించిన స్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఎంఓ ఒత్తిడితో..

తిలక్ రోడ్డు జబ్బార్ వీధి విస్తరణలో ఇంటి స్థలం కోల్పోయిన ఇనయతుల్లా తనకున్న పలుకుబడితో టీడీఆర్ బాండ్ కోసం తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చారు. రూ 2.5 కోట్ల విలువ గల టీడీఆర్ బాండ్ కోసం ఆయన సీఎంఓలో పావులు కదిపారు. సీఎంఓతో పాటు ఓ మంత్రి నుంచి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఒత్తిడి పెరిగింది. తప్పని పరిస్థితుల్లో తిరుపతి జబ్బార్ లే అవుట్‌కు చెందిన ఇనయతుల్లా కు టీడీఆర్ బాండును ఒక్కరోజు వ్యవధిలోనే జారీ చేసిన ఘనత కార్పొరేషన్ ఉన్నతాధికారులకే దక్కింది. టీడీఆర్ బాండ్ల కమిటీ నేరుగా సమావేశం కాకుండానే శనివారం రాత్రికి రాత్రే టీడీఆర్ బాండ్‌ను మంజూరు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి సోమవారం డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ మౌర్యకు భూములు కోల్పోయిన యజమానులు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని వేడుకుంటున్నా అధికారులు మాత్రం కనికరించడం లేదు.

టీడీఆర్ బాండ్ల వివరాలు	
మొత్తం టీడీఆర్ బాండ్లు	1149
ఇప్పటి వరకు జారీ చేసినవి	442
ఇవ్వాల్సినవి	707

ఒక్కరి కోసం కదిలిన యంత్రాంగం

తిరుపతిలో టీడీఆర్ బాండ్ల వ్యవహారం వాడి వేడిగా ఉంది. రోడ్ల అభివృద్ధి కోసం భూములు వదులుకున్న రైతులు, యజమానులకు నష్టపరిహారం కింద టీడీఆర్ బాండ్లను ఇవ్వాల్సి ఉంది. వీటి జారీ కోసం ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, డిప్యూటీ సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్, అనంతపురం రీజినల్ డైరెక్టర్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ టీడీఆర్ బాండ్ల జారీపై పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలించి, క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరం అన్ని సక్రమంగా ఉంటే యజమానులకు టీడీఆర్ బాండ్లను జారీ చేయాల్సి ఉంది. వందల మంది టీడీఆర్ బాండ్ల కోసం ఎదురు చూస్తుంటే కేవలం ఒకరి కోసం ఆగమేఘాలపై జూమ్ మీటింగ్ నిర్వహించి రాత్రికి రాత్రి మంజూరు చేశారు. కమిటీ కూర్చుని రికార్డులను పరిశీలించిన తర్వాత అభ్యంతరాలు లేని పక్షంలో బాండ్‌ను జారీ చేయాలి. అలా కాకుండా ఇన్‌చార్జి రీజినల్ డైరెక్టర్ కర్నూలులో ఉండగానే వాట్సప్ ద్వారా సంతకం చేసిన దస్త్రాన్ని తెప్పించుకుని టీడీఆర్ బాండ్‌కు ఆమోదం చేయించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చింతగుంట సచివాలయంపై దాడి


చింతగుంట గ్రామ సచివాలయంపై జరిగిన రాళ్ల దాడిలో ధ్వంసమైన అద్దాలు

చిన్నగొట్టిగల్లు (ఎర్రావారిపాళెం) : ఎర్రావారిపాళెం మండలం చింతగుంట పంచాయతీలో గ్రామ సచివాలయం అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. గత ప్రభుత్వంలో నిర్మించిన గ్రామ సచివాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి పూట రాళ్లతో దాడి చేసి, సచివాలయం అద్దాలు ధ్వంసం చేసి పరారయ్యారు. ఉదయం యథావిధిగా సచివాలయానికి చేరుకున్న సిబ్బంది పగిలిన అద్దాలు చూసి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమలత ఎర్రావారిపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరంపై పోలీసుల విచారణ

కోట:విద్యానగర్‌లో చోటుచేసుకున్న సైబర్ నేరంపై పోలీసులు మంగళవారం విచారణ జరిపారు. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం మేరకు.. విద్యానగర్‌లో ఎస్‌బీఐ సేవా కేంద్రం నడుపుతున్న మోహన్ వద్దకు గత శనివారం ఓ వ్యక్తి వచ్చి తన అకౌంట్ నుంచి రూ.40 వేల డబ్బులు కావాలన్నాడు. ప్రాథేయపడడంతో సరే అన్నాడు. వచ్చిన వ్యక్తి మరో మహిళతో ఫోన్ కలిపి తన అక్క లైన్‌లో ఉందని మీ ఫోన్‌పే నంబర్ చెబితే దానికి డబ్బులు వేస్తుందని చెప్పాడు. ఆమెతో ఫోన్‌లో మాట్లాడిన మోహన్ ఫోన్‌పే నంబర్ చెప్పాడు. ఆమె ఆ అకౌంట్‌కు రూ.40 వేలు వేసింది. వెంటనే మోహన్ అతనికి నగదు ఇచ్చేశాడు. 10 నిమిషాల తరువాత విజయవాడకు చెందిన రమ్య అనే మహిళ మోహన్‌కు ఫోన్ చేసి తను వేసిన రూ.40 వేలు వెనక్కి ఇచ్చేయాలని కోరింది. తన తమ్ముడు అనుకుని డబ్బులు వేశానని, ఫోన్ చేసింది తన తమ్ముడు కాదని చెప్పింది. దీనిపై రమ్య తన భర్తతో కలసి విజయవాడ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కోట ఎస్ఐకు ఫోన్ చేసి దీనిపై విచారణ జరపాలన్నారు. కోట పోలీసులు మోహన్ దగ్గర డబ్బులు తీసుకువెళ్లిన వ్యక్తి ఎవరు అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. రమ్యతో తన తమ్ముడు గొంతుతో మాట్లాడిన ఫోన్ నంబర్ ఆధారంగా ఆ వ్యక్తి చెన్నై అడ్రస్‌తో ఉన్నట్లు గుర్తించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా నిర్మూలనకు సమష్టి కృషి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్,ఎస్పీ, జేసీ, ఎక్సైజ్‌శాఖ అధికారులు

తిరుపతి అర్బన్: సారా నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శుభం బన్సల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సారా నిర్మూలనకు ఎక్సైజ్‌తోపాటు పలు విభాగాలకు చెందిన అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సారా నివారణకు సంబంధించి నవోదయ 2.0 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి, అవగాహన కల్పించాలని ఆదేశించారు. సారా నేరస్తులపై బైండ్ ఓవర్ కేసులు నమోదుతోపాటు రూ.లక్ష జరిమానా విధించాలన్నారు. 3 నెలల్లో తిరుపతిని సారారహిత జిల్లాగా ప్రకటించేలా మార్పులు తీసుకురావాలన్నారు. జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్,ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీపీఓ సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, సీపీఓ మునిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో మార్పు మొదలైంది

– టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో మార్పు మొదలైందని మాజీ ఎమ్మెల్యే బియ్యం మధుసూదనరెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ యూత్ ఏర్పేడు మండల అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, ఆయన అనుచరులు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వినోద్‌రెడ్డి, ఢిల్లీబాబు, దినేష్, ఉపేంద్రకుమార్, కుబేరుడు, వెంకటేష్, ప్రశాంత్,భాస్కర్ తదితరులలు ఉన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల ప్రెసిడెంట్ కునాటి రమణయ్య యాదవ్, బత్తి శెట్టి, శివయ్య, రామ్మూర్తి, అయోధ్య, కేశవ, రాజశేఖర్, రామాచారి, రవి యాదవ్, గాలి రవి, చల్లా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కార్ల దొంగ అరెస్ట్


స్వాధీనం చేసుకున్న కార్లతోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : కార్లు అద్దెకు తీసుకుని ఉడాయించే దొంగను మంగళవారం అలిపిరి పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ రామకిషోర్ తెలిపారు. వివరాలు.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని చిన్నమీరానికి చెందిన గుద్దేటి మహేష్ నూతన కుమార్ ఫిబ్రవరి 11వ తేదీన నకిలీ ఆధార్ కార్డు వినియోగించి తిరుపతిలో ఓ వ్యక్తి వద్ద బ్రిజా కారును అద్దెకు తీసుకెళ్లాడు. ఐదురోజులపాటు వాడుకుని తెలంగాణ సరిహద్దుల వద్ద కారు జీపీఎస్ పనిచేయకుండా చేశాడు. తన సెల్‌ఫోన్ సైతం స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. కారు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాలతో కారు ఎక్కడ ఉందో గుర్తించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తిరుపతి జూపార్క్ రోడ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. కారును అపహరించిన కేసులో నిందితుడిగా పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే నిందితుడిపై కోల్‌కత్తా, ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్, భువనేశ్వర్, బెంగళూరు, చెన్నై, భీమవరం, ముంబయిలో ఇదే తరహా కేసులకు సంబంధించి మొత్తం 24 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఐదు సార్లు అరెస్టు జైలు శిక్ష కూడా అనుభవించినట్లు వెల్లడించారు. ఈ మేరకు నిందితుడి నుంచి రూ.30లక్షల విలువైన మూడు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసును ఛేదించిన ఎస్ఐ లోకేష్, సిబ్బందికి సీఐ అభినందనలు తెలిపారు.

శ్రీసిటీలో నేషనల్ డిఫెన్స్ కళాశాల అధికారులు


శ్రీసిటీ ఎండీ నేతృత్వంలో నేషనల్ డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం సమీక్ష

శ్రీసిటీ (వరదయ్యపాళెం): భారతదేశ పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధిపై అధ్యయనంలో భాగంగా న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజ్ (ఎన్‌డీసీ)కి చెందిన 17 మంది సభ్యుల ప్రతినిధి బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. మేజర్ జనరల్ సీపీ సంగ్రా, ఏవీఎస్ఎం వైఎస్ఎం(రిటైర్డ్) నేతృత్వంలో భారత సాయుధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులతో సహా విచ్చేసిన బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ఏకీకృత వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం, భారతదేశ తయారీ, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భాగస్వామ్యం గురించి ఆయన వారికి వివరించారు. పర్యటన కోఆర్డినేటర్‌లుగా ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్ఆర్‌డీఐ) డైరెక్టర్ జి.శ్రీనివాసులు, కొంతమంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

చరిత్రకు సజీవ సాక్ష్యం చిత్రలేఖనం

- శ్రీవిద్యానికేతన్‌లో ప్రారంభమైన విష్ణు ఆర్ట్ ఫౌండేషన్
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న మోహన్ బాబు, మంచు విష్ణు


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు

చంద్రగిరి: చరిత్రకు చిత్రలేఖనం సజీవ సాక్ష్యమని, పురాతన కాలం నుంచి చిత్రాల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుంటున్నామని ఎంబీయు ప్రో చాన్సలర్, మంచు విష్ణుఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంచు విష్ణు అన్నారు. మన ప్రాంతంతో పాటు దేశ, విదేశాల్లోని కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2013లో మంచు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. మంగళవారం విద్యాసంస్థల్లో మంచు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ మంచు మోహన్‌బాబు, సీఈఓ విష్ణులు పాల్గొన్నారు. తొలుత కుటుంబ సమేతంగా మోహన్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు వారి కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం కళాకారులను మోహన్‌బాబు, మంచు విష్ణు ఘనంగా సత్కరించారు.

రూ.14.30 లక్షలకు మహిళ ఐపీ

తిరుపతి లీగల్: తిరుపతికి చెందిన సి.అమ్ములు తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.14.30 లక్షలకు ఐపీ దాఖలు చేసినట్టు ఆమె తరపు న్యాయవాది ఆర్ గజేంద్ర తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు, తిరుపతి, జబ్బార్ లేఅవుట్‌లో అమ్ములు టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ ఉండేవారు. కొంతమంది సలహాలతో ఆమె ప్రైవేటు చిట్ వ్యాపారాన్ని ప్రారంభించారు. అయితే కరోనా రావడంతో చాలామంది చిట్ సొమ్ము చెల్లించడం మానేశారు. కొంతమంది తిరుపతి వదిలి వెళ్లిపోయారు. దీంతో ఆమె డబ్బులను అధిక వడ్డీలకు కొంతమంది వద్ద తీసుకున్నారు. రుణదాతల వేధింపులు ఎక్కువ కావడం, వ్యాపారాల్లో నష్టాలు రావడంతో వారికి సొమ్ము చెల్లించలేని స్థితిలో ఈ ఐపీ ని దాఖలు చేసినట్టు ఆమె పిటిషన్ లో పేర్కొన్నారు. ఎనిమిది మంది రుణదాతలను ఆమె పిటిషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

పేదల ఇల్లు కూల్చివేత


నేలమట్టమైన పేదల ఇళ్లు


తమకిచ్చిన అనుభవదారు పట్టాలను చూపుతున్న బాధితులు

- లంచం ఇవ్వలేని కూల్చివేశారనంటున్న బాధితులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): గత ప్రభుత్వంలో అనుమతి ఇచ్చిన ఇళ్లకు ప్రస్తుతం ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఐదు ఇళ్లను రెవెన్యూ అధికారులు మంగళవారం నేలమట్టం చేశారు. రేణిగుంట మండలం కొత్తపాళెం రెవెన్యూ పరిధిలోని లారీ డ్రైవర్ల కాలనీలో గత ప్రభుత్వంలో ఇళ్లు కట్టుకుని ఉన్నారు. సర్వే నంబర్ 100/1 లోని భూమి, వాగు పోరంబోకు స్థలమని, అందులో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని మంగళవారం ఉదయం వీఆర్వో శంకర్ జేసీబీతో ఐదు ఇళ్లను నేలమట్టం చేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇళ్లు కూల్చడంపై బాధితులు బోరున విలపించారు. దీనిపై తహసీల్దార్‌కు వివరణ కోరగా అక్రమ కట్టాలను కూల్చివేస్తామని చెప్పారు.

వీఆర్వోకు డబ్బులివ్వలేదనే కక్ష



"గత ప్రభుత్వంలో దళారుల మాట నమ్మి వారికి కొంత డబ్బు ఇచ్చి ప్లాట్లు తీసుకున్నాం. వాటిలో ఇల్లు కట్టుకునేటప్పుడు అప్పట్లో వీఆర్వో శంకర్ వచ్చి మా వద్ద డబ్బులు తీసుకుని ఇల్లు కట్టుకునేందుకు అనుమతి ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు అదే వీఆర్వో వచ్చి ఒక ప్లాట్‌కు రూ.20 వేలు ఇవ్వాలని, లేదంటే మీ ఇళ్లు నేలమట్టం చేస్తామని చెప్పారు. మా దగ్గర డబ్బులు లేకుండా వీఆర్వోకు ఇవ్వలేకపోయాం. అది మనసులో పెట్టుకుని మాకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మా ఇళ్లను నేలమట్టం చేశారు. ఉన్నతాధికారులు మాపై దయవుంచి మాకు న్యాయం చేయాలి.

– బాధితుడు శివయ్య లారీ డ్రైవర్ల కాలనీ ఎల్లమండ్యం పంచాయితీ

మాకు ఇంకా చావే దిక్కు



పెద్దల జోలికి వెళ్లకుండా పేదలమైన మా ఇళ్లను కూల్చడం దారుణం. అప్పుచేసి కట్టుకున్న ఇళ్లను నేలమట్టం చేశారు. కట్టుకున్న ఇల్లు నేలమట్టం అయింది అప్పు అలాగనే ఉంది మాకు ఇంకా చావే దిక్కు. మేము డబ్బులు పెట్టి కొనుక్కున్న స్థలాలను కక్షగట్టి పడగొట్టారు. మాకు న్యాయం చేయండి.

– షకీలా, లారీ డ్రైవర్ల కాలనీ, ఎల్లమండ్యం పంచాయతీ.

భూ ఆక్రమణలపై ముమ్మర దర్యాప్తు

- రెవెన్యూ, అటవీశాఖ భూ రికార్డుల తనిఖీ
- రెవెన్యూ, అటవీశాఖ అధికారులను ఆదేశాలు
- బనవాయిగుంట, పూలరంగడుపల్లెలో పర్యటించిన సబ్‌కలెక్టర్
- సాక్షి దినపత్రికలోని కథనాన్ని తహసీల్దార్‌తో చదివించిన సబ్‌కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..


సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీన

వెంకటగిరి రూరల్: అటవీ భూముల ఆక్రమణపై సబ్‌కలెక్టర్ సీరియస్ అయ్యారు. భూ ఆక్రమణలపై దర్యాప్తు చేపట్టారు. గ్రామసభలు నిర్వహించి నివేదికను సమర్పించాలని అటవీ, రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరి రూరల్ మండలంలోని పూలరంగడుపల్లి, బనవాయిగుంట ప్రాంతాల్లో ఉన్న అటవీ భూములు ఆక్రమణకు గురయ్యాయని సాక్షి దినపత్రికలో ‘ఆటవిక రాజ్యం’ శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన మంగళవారం వెంకటగిరికి చేరుకుని తహసీల్దార్ రాంబాబు, అటవీశాఖ అధికారులతో కలిసి భూ ఆక్రమిత ప్రాంతాల్లో పర్యటించారు. సాక్షి దినపత్రికలో వచ్చిన ఫొటోలు ఏ ప్రాంతంలో ఉన్నాయో తెలుసుకుని అక్కడికి చేరుకున్నారు. సాక్షి దినపత్రిలో ప్రచురితమైన కథనాన్ని చదివి వినిపించాలని తహసీల్దార్ రాంబాబుని ఆదేశించారు. ఆ కథనాన్ని తహసీల్దార్ చదివారు. ఈ మేరకు భూ ఆక్రమణలు ఎంత మేర జరిగాయి.. రెవెన్యూ, అటవీశాఖలకు సంబంధించిన భూమి ఎంత ఉండాలన్న అంశంపై అధికారులను అడిగి రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించి రికార్డుల ఆధారంగా తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. అలాగే గ్రామసభల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని తహసీల్దార్ రాంబాబు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. సర్వేయర్ సుప్రజ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి పేట, చిన్నగొట్లగుంట, పెద్ద గొట్టగుంట ప్రాంతాల్లో రాఘవేంద్ర మీన పర్యటించి, భూవివాదాలపై చర్చించారు.

రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం

"బనవాయిగుంట సర్వే నంబర్ 74లో ఆక్రమణలు జరిగాయని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఆ భూములు సాగు చేసుకుంటున్న రైతులు వద్ద టెన్‌వన్ అడంగల్, డీ పట్టాలు పరిశీలించి అధికారులకు ఆదేశించాం. ఈ ప్రాంతంలో కొంత మేర సీజేఎఫ్ఎస్ భూములు కూడా ఉన్నాయి. రికార్డులను పరిశీలించిన తరువాత తగు చర్యలు తీసుకుంటాం.

–రాఘవేంద్రమీన, సబ్ కలెక్టర్ గూడూరు